అడవికి నిప్పు.. ఏదీ కనువిప్పు?



ఈ ఏడాది జనవరి 31న పెనుకొండ పరిధిలో కాలుతున్న అటవీ ప్రాంతం (ఫైల్)



ఇక్కడ ఫైర్ సిబ్బంది మంటలార్పుతున్నది సోమందేపల్లి సమీపంలోని అటవీ ప్రాంతం. ఈ ఏడాది జనవరి 26న అడవికి నిప్పు పెట్టడంతో ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారు. కొత్త గడ్డి కోసం పశువుల కాపర్లు ఈ పని చేసి ఉండవచ్చని అటవీ సిబ్బంది అనుమానం వ్యక్తం చేశారు.

- పెనుకొండ రేంజ్ పరిధిలో 32 వేల హెక్టార్లలో అడవి
- తరచూ కాలిపోతున్న వన సంపద
- తల్లడిల్లిపోతున్న వన్యప్రాణులు

వేసవి కాలం వస్తే చాలు కార్చిచ్చుతో అడవి తల్లి శోకిస్తోంది. ఆకతాయిల ఆగడాలతో పచ్చని అటవీ ప్రాంతం కాలి బూడిదవుతోంది. దీనికితోడు వన్యప్రాణులకు నష్టం వాటిల్లితోంది. అటవీ సంపద అంతకంతకూ తరగిపోతుండటంపై పర్యావరణ వేత్తలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోమందేపల్లి: పెనుకొండ రేంజ్ పరిధిలో దాదాపు 32 వేల హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ప్రధానంగా పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఎక్కువగా ఉంది. అయితే 2023–24లో దాదాపు 20 చోట్ల అటవీ ప్రాంతంలో కార్చిచ్చు కారణంగా విలువైన అటవీ సంపద బూడిదపాలైంది. ఆకతాయిల చేష్టలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కువగా నెమళ్లు, జింకలు, దుప్పులు, అడవి పందులు, ఎలుగుబంట్లు, చిరుతలు కూడా ఉన్నాయి. అదేవిధంగా వివిధ రకాల పక్షులు కూడా ఇక్కడి అడవిలో ఉన్నాయి. అయితే తరచూ అడవికి నిప్పు పెడుతుండంతో వణ్య ప్రాణుల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోంది. దీనికితోడు జీవాలకు గడ్డి కొరత కూడా ఏర్పడుతోంది.

పర్యావరణానికి ముప్పు

అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోవడం వలన పర్యావరణం దెబ్బతింటోంది. పచ్చని చెట్లు కాలి బూడిద అవుతున్నాయి. దీంతో అటవీ ప్రాంతం కళాహీనంగా మారుతోంది. అందువల్ల ఫారెస్ట్ అధికారులు తగిన జాగ్రత్తలు చేపట్టాలని ప్రకృతి ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో అటవీశాఖలో కిందిస్థాయి సిబ్బంది ఎక్కువగా ఉండేవారు. అయితే ప్రస్తుతం వాచర్లు, గార్డుల కొరత ఉండటంతో పర్యవేక్షణ కరువైంది.

పెనుకొండ పరిధిలో అధికం

పెనుకొండ మండల పరిధిలోని వెంకటాపురం తండా, గోనిపేట, పుట్టపర్తి వెళ్లే బ్రిడ్జిల వద్ద ఆతాయిలు తరచూ అటవీ సంపదకు నిప్పు పెడుతుండటంతో కార్చిచ్చు రగులుతోంది. దీంతో జాతీయ రహదారి పైకి మంటలు వ్యాపిస్తున్నాయి. ఈ ప్రాంతంలో గట్టి నిఘా ఏర్పాటు చేసి అటవీ సందపను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

జైలు శిక్ష తప్పదు

అడవులకు నిప్పు పెడితే మూడు నెలల నుంచి ఏడాది వరకూ జైలు శిక్ష తప్పదు. అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. మా దృష్టికి వచ్చిన వెంటనే మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేస్తున్నాం. మా శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఆకతాయిల వ్యవహారంతోనే ఎక్కువగా ప్రమాదాల జరుగుతున్నాయి. వణ్యప్రాణులకు ఎలాంటి హానీ జరుగకుండా చర్యలు తీసుకుంటాం. అడవుల సంరక్షణ కోసం ప్రజలు సహకరించాలి.

– శ్రీనివాసరెడ్డి, రేంజర్, పెనుకొండ

పర్యావరణాన్ని కాపాడాలి



అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. లేదంటే ఉన్న పచ్చదనం కాస్తా అంతరించి పోయి పర్యావరణ దెబ్బతింటుంది. కట్టెలు కొట్టడానికి వెళ్లే వారిపై నిఘా ఉంచాలి. జంతువుల సంరక్షణ చేపట్టాలి. అటవీ శాఖలో సిబ్బంది కొరత లేకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి.

– హరిలాల్ నాయక్, పెనుకొండ

క్లుప్తంగా

అంబులెన్స్ సేవలు వినియోగించుకోండి



రొళ్ల టోల్‌ప్లాజా వద్ద 1033 అంబులెన్స్ సేవలు ప్రారంభిస్తున్న దృశ్యం

రొళ్ల: ఎన్‌హెచ్‌ఏఐ 544ఈ జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల సందర్భంగా అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడడం కోసం కేటాయించిన 1033 (ఎన్‌హెచ్‌ఏఐ) అంబులెన్స్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టోల్‌ప్లాజా మేనేజర్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని రొళ్ల కొండ గ్రామ సమీపంలో 544ఈ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాకు రూ.25 లక్షల వ్యయంతో కేటాయించిన 1033 నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు. టోల్ ప్లాజా మేనేజర్ మాట్లాడుతూ అంబులెన్స్ జాతీయ రహదారి పై 24 గంటలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. పైలెట్‌తో పాటు ఇద్దరు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించినప్పుడు, అత్యవసర సమయంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

15న మెగా జాబ్‌మేళా

మడకశిర: పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఈనెల 15న మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అర్హులైన దాదాపు 2 వేల మందికి ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యాయామంతో కేన్సర్‌కు చెక్



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

పావగడ: శారీరక వ్యాయామం, పరిమిత ఆహారంతో కేన్సర్ వ్యాధికి చెక్ పెట్టొచ్చని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి పాలనా వైద్యాధికారి డా ఎఎస్‌ఎల్ బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రపంచ కేన్సర్ దినోత్సవంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ మహమ్మారిని తుద ముట్టించేందుకు జీవన శైలిలో మార్పులు అవసరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ వైద్యురాలు శంరీన్ భాను, సిబ్బంది ఎండీ ఖాసీం, ఆర్ ఓంకార్, గొల్లాలప్ప, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు ప్రారంభం

గోరంట్ల: మండల పరిధిలోని యర్రయ్యగారిపల్లి గ్రామం నుంచి మేరెడ్డిపల్లి గ్రామానికి రూ.1.14 కోట్ల ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును బుధవారం మంత్రి సవిత ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రొద్దం తహసీల్దార్‌గా ఉదయ్‌శంకర్‌రాజు



రొద్దం: మండల తహసీల్దార్‌గా ఉదయశంకర్‌రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాగేంద్ర డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతిపై కడపకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నూతన తహసీల్దార్‌గా దయశంకర్‌రాజు ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్‌ను బీజేపీ మండల కన్వీనర్ మండల కన్వీనర్ ఈడిగ పవన్‌కుమార్ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

రుణాల దరఖాస్తులకు నేడు ఆఖరు

హిందూపురం: కాపు కార్పొరేషన్ ద్వారా కాపు, బలిజ, ఒంటరి, తెలగ లబ్ధిదారులకు స్వయం ఉపాధి కింద రుణాల కోసం 6వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తుల చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 11 యూనిట్లు కేటాయించారని తెలిపారు. 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల లోపు కలిగి వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. కులం సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బ్యాంక్ పాసు బుక్, సెల్ నంబర్‌తో దరఖాస్తులను మున్సిపల్ ఆఫీసులోని మెప్మా విభాగంలో సమర్పించాలని కోరారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుడిబండ: మండలంలోని వివిధ గ్రామాల్లో పాడిపశువులు, మేకలు, గొర్రెల పెంపకదారులు రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు ఉంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 100కు సమాచారం అందించాలన్నారు. పాడి పశువులను దొంగలించే వ్యక్తులను పట్టుకునేందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు.

ప్రతిభావంత క్రీడాకారులకు ప్రోత్సాహం



దివ్యాంగుల క్రికెట్ ఇండియన్ టీం కెప్టెన్ వసంత్ కుమార్‌ను సన్మానిస్తున్న వేణురెడ్డి తదితరులు

హిందూపురం: ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. నేపాల్‌లో ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకూ జరిగే దివ్యాంగుల టీ–20 క్రికెట్ టోర్నమెంట్ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్, హిందూపురానికి చెందిన వసంత్‌కుమార్‌ను బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేపాల్ వెళ్లేందుకు ఆయనకు ఆర్థికసాయం చేశారు. క్రికెట్ టోర్నీలో రాణించాలని వేణురెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జిల్లా బూత్ కమిటీల ఇన్‌చార్జులు లోకేష్, ఫారుక్, అయూబ్ బేగ్, నడ్లపల్లి ప్రణయ్‌రెడ్డి, నవీన్, ఇనాయత్, బాబా, సూరి తదితరులు పాల్గొన్నారు. అలాగే లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ కూడా వసంత్‌కుమార్‌కు రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు.

రూ.6.30 కోట్ల రుణాల మంజూరు



హౌసింగ్ లోన్ మంజూరు పత్రాలు అందిస్తున్న రీజినల్ మేనేజర్ రమేష్

హిందూపురం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ద్వారా అన్నిరకాల రుణాలను తక్కువశాతం వడ్డీరేటుతో అందిస్తోందని ఖాతాదారులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు కదిరి రీజినల్ మేనేజర్ రమేష్ అన్నారు. బుధవారం స్థానిక నానెప్పనగర్ బ్రాంచ్‌లో రుణ విస్తరణ కార్యక్రమంలో భాగంగా వాహనాల కొనుగోలు, హౌసింగ్ రుణాలను మంజూరు పత్రాలను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో ఎంఎస్‌ఎంఈ గృహ, వాహన రుణాలు రూ.6.34 కోట్లు మంజూరు చేశామన్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి నేటివరకూ రూ.15 కోట్లు ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా తక్కువ వడ్డీతో అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్లు రమణయ్య, సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్, మేనేజర్లు అశోక్, ప్రసన్నకుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నాగబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి

మడకశిర: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై జనసేన నేత నాగబాబు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా పర్యటన సందర్భంగా నాగబాబు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఇప్పటికే అటవీ భూముల విషయంలో మాజీ మంత్రిపై వచ్చిన ఆరోపణలపై గతంలో రెండు సార్లు విచారణకు ఆదేశించారన్నారు. ఈ విచారణలో అటవీ భూములు ఆక్రమణలకు గురికాలేదని పేర్కొన్నారు. మళ్లీ అదే అంశంపై ఎల్లోమీడియా, కూటమి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం స్వగ్రామమైన సదంలో ఆస్పత్రి నిర్మాణానికి రూ.కోట్లు విలువ చేసే భూమిని ఉచితంగా ఇచ్చారనే విషయాన్ని కూటమి నాయకులు గుర్తించాలన్నారు.

బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అమరాపురం: మండలంలోని కాపు కులస్తులు ఈ నెల 6వ తేదీలోపు సబ్సిడీ రుణాల కోసం కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామరావు సూచించారు. అదేవిదంగా బీసీ కార్పొరేషన్‌లో రుణాల కోసం బీసీ కులస్తులు 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రమాదాలను నివారించండి

లేపాక్షి: మండలంలోని వెంకటాపురం, ఓబుళాపురం గ్రామాల నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డును వెడెల్పు చేసి ప్రమాదాలు నివారించాలని డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డికి స్థానికులు బుధవారం వినతి పత్రంను అందజేశారు. జాతీయ రహదారిలోని బిసలమానేపల్లి వద్ద ఉన్న మలుపులో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. హైవే అధికారులు ఈ రోడ్డులో వెళ్లడానికి ఎలాంటి సిగ్నల్ గాని, సర్వీసు రోడ్డు గాని వేయకపోవడంతో ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే రోడ్డు విస్తీర్ణ పనులకు శ్రీకారం చుట్టి ప్రమాదాలు నివారించాలని విన్నవించారు.

అందుబాటులో గుండెపోటు నివారణ మందు

మడకశిర: మడకశిర ఏరియా ఆస్పత్రిలో గుండెపోటు నివారణ మందు రోగులకు అందుబాటులో ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిరేఖ ఒక ప్రకటనలో తెలిపారు. గుండెపోటు నుంచి అత్యవసరంగా కాపాడడానికి అవసరమైన టెనెక్టేప్లేస్ సూది మందు ఆస్పత్రిలో అందుబాటులో ఉంచామన్నారు. రక్త నాళాల్లో రక్తం గడ్డ కట్టి ఉంటే ఈ మందు గడ్డను కరిగిస్తుందన్నారు. గుండెపోటు లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు.

దళితుల హక్కులను పరిరక్షించాలి

రొళ్ల: కుల వివక్షతను విడనాడి దళితుల హక్కులను పరిరక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య, కార్యదర్శి ఎంపీ రమణ పేర్కొన్నారు. బుధవారం రొళ్ల మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సభ్యులు సందర్శించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో కొందరు దళితులపై వివక్ష చూపుతున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు కావస్తున్నా నేటికీ అంటరానితనం నిర్మూలించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు.

ఉత్తమ సిబ్బందికి సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

హిందూపురం టౌన్: జిల్లా స్థాయిలో ఉత్తమ సీఆర్‌ఎంటీగా ఎంపికైన రేణుక, ఉత్తమ అకౌంటెంట్‌గా ఎంపికైన కేజీబీవీ మానసను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శివకుమార్, ఎంఈఓ గంగప్ప ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం మండలానికి చెందిన సిబ్బంది జిల్లా స్థాయిలో ఉత్తమ సిబ్బందిగా ఎంపిక కావడంతో హర్షణీయమన్నారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మాధవి, ఎంఐఎస్ నందిని, కంప్యూటర్ ఆపరేటర్ తౌసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కెంచమాంబదేవి ఉత్సవాలు



అలంకరణలో కెంచమాంబదేవి

అమరాపురం: మండల పరిధిలోని ఉదుగూరు గ్రామంలో వెలసిన కెంచమాంబదేవి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. గత నెల 30న ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం హోలి ఉత్సవాలతో ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు.

కరియమ్మదేవికి జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవంలో భక్తుల కోలాహలం

అమరాపురం: మండల పరిధిలోని ఆలదపల్లిలో బుధవారం కరియమ్మదేవికి జ్యోతుల ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మహిళలు తమ ఇంటి నుంచి పిండితో తయారు చేసిన జ్యోతులను తయారు చేసుకుని గ్రామ వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మ వారికి హారుతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రైతు సమస్యలపై నేడు వైఎస్సార్‌సీపీ నిరసన

అగళి: రైతు సమస్యలపై మండల కేంద్రంలో గురువారం ఉదయం 11.30 గంటలకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. కరెంటు చార్జీల పెంపు, లో ఓల్టేజ్ సమస్యలపై మండలంలోని రైతులతో కలసి మండల కేంద్రంలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, ముఖ్యనాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమంలో విజయవంతం చేయాలన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయండి



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ వీఆర్ రాము మాట్లాడుతూ గతంలో ఎంతోమంది కార్మికుల రక్తార్పణతో, ప్రాణ త్యాగంతో సాధించిన 29 కార్మిక చట్టాలు అమలు చేయాలన్నారు. అలాగే రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పునఃపరిశీలన

లేపాక్షి: మండల వ్యాప్తంగా పింఛన్‌దారుల ఆరోగ్య పరిస్థితి, హెల్త్ సర్టిఫికెట్‌లను పునఃపరిశీలన చేయడానికి 7, 12, 13 తేదీల్లో వైద్య బృందం విచ్చేస్తున్నారని ఎంపీడీఓ నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 7న లేపాక్షి-1, లేపాక్షి -2, లేపాక్షి -3, కొండూరు, 12న కంచిసముద్రం, మానేపల్లి, మైదుగోళం, పులమతి, శిరివరం, 13న చోళసముద్రం, కల్లూరు, కోడిపల్లి గ్రామాల్లో పింఛన్లను పరిశీలిస్తారన్నారు. నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు ఇంటి వద్దనే ఉండి వైద్యు బృందానికి సహకరించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలో భూమి ఉన్న ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పంటలను సాగు చేసి ఆదాయం పొందాలని రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యులు మల్లేశ్వరి, కీర్తన తెలిపారు. బుధవారం ఆమిదాలగొందిలో విద్యార్థులతో కలిసి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల ద్వారా రైతులకు నష్టం తప్ప లాభం ఉండదన్నారు. సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను సాగు చేస్తే తెగుళ్ల వ్యాప్తి ఉండదని, పంట దిగుబడి పెరిగి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శేషవాహనంపై వేంకటరమణుడు



హిందూపురం మెయిన్ బజారులోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మారథోత్సవంలో భాగంగా బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవమూర్తులను శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నరసింహమూర్తి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హిందూపురం:

ముగిసిన నాగలమడక జాతర





కార్తికేయుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం, అంత్య సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

పావగడ: నియోజకవర్గంలోని నాగలమడక గ్రామంలో వెలసిన అంత్య సుబ్రహ్మణ్యం స్వామి చిన్న జాతర ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ ఆధ్వర్యంలో అర్చక బృందం కార్తికేయుడికి విశేష పూజలు నిర్వహించారు. అష్టోత్తరం, సహస్ర నామ పారాయణం, ఏకవార రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ప్రదర్శించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.